# సర్కారుపై వ్యతిరేకత వచ్చింది..

- ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలి..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన మాజీ మంత్రి వనమా


భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : అనతికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై రాష్ట్రవ్యాప్తంగా పూర్తి వ్యతిరేకత వచ్చిందని, ఎక్కడ చూసినా పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధే కనిపిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, ఆయన కుమారులు వనమా రాఘవేంద్రరావు, రామకృష్ణలు కేటీఆర్‌ను శనివారం కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ కొత్తగూడెం నియోజకవర్గ రాజకీయ పరిస్థితుల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ రాజకీయాల్లో మంచి అనుభవం ఉన్న నాయకులు ధైర్యంగా ఉండాలన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ.. వారి సమస్యలపై పోరాటాలు చేస్తూ అండగా నిలవాలన్నారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఇందుకోసం అందరూ సమష్టిగా పని చేయాలని సూచించారు. నేటికి రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా ఇవ్వకపోవడంతో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే కొత్తగూడెం నియోజకవర్గ నాయకుడు మధుచంద్ కూడా కేటీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను కలిసి బొకే అందజేశారు.



హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసిన మాజీ మంత్రి వనమా, ఆయన కుమారులు రాఘవ, రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు

# ఎల్ఆర్ఎస్‌కు మోక్షం కలిగేనా?

- సరిపడా రెవెన్యూ సిబ్బంది లేకుండా సాధ్యమయ్యేనా?
- ప్రభుత్వం వద్ద పేరుకుపోయిన వేలాది దరఖాస్తులు
- ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ప్లాట్ల యజమానులు
- సామాన్యులపై భారం మోపుతున్న కాంగ్రెస్ సర్కార్



ఖమ్మం, ఫిబ్రవరి 22 : ఎల్ఆర్ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుదారుల సమస్య ఇప్పటికైనా పరిష్కారం అవుతుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగేండ్లకుపైగా ఎల్ఆర్ఎస్ కోసం ఎదురుచూస్తున్న ప్లాట్ల కొనుగోలుదారులకు ఇప్పుడైనా రెగ్యులరైజేషన్ అయ్యే అవకాశాలు కనిపించట్లేదు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో సరిపడా సిబ్బంది లేని కారణంగా గతంలో మాదిరిగా ఉండే అవకాశాలు ఉన్నవి. ప్రభుత్వం సిబ్బందిని పెంచకపోతే ఎల్ఆర్ఎస్ పూర్తిచేయడం కష్టమని పలువురు అధికారులే పేర్కొంటున్నారు. మార్చి 31వ తేదీలోపు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేస్తే 25 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అనధికారిక లే అవుట్లలో కేవలం పదిశాతం ప్లాట్లు రిజిస్టర్ అయి ఉండి.. మిగిలినవి రిజిస్టర్ కాకపోతే 90 శాతం ప్లాట్ల క్రమబద్ధీకరణకు అనుమతించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఇందులో కొత్తదనమేమీ లేదు. ఎల్ఆర్ఎస్ ప్రవేశపెట్టినప్పుడే ఆ అవకాశం కల్పించారు. దీంతో చాలా మంది రియల్టర్లు, అనుమతి లేని లే అవుట్లలో ప్లాట్లు కొన్నవారు మొదట్లో రూ.10 వేల చొప్పున ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత రూ.1000 చొప్పున వసూలు చేశారు. అయినా క్రమబద్ధీకరణ జరగలేదు. ప్లాట్ కొనుగోలుకు సంబంధించిన సేల్ డీడ్ ఉన్నవారికి కూడా 25 శాతం రాయితీ ఇస్తున్నట్లు తాజాగా చేసిన ప్రకటన కొంత ఊరట కలిగిస్తున్నది. ప్రభుత్వం ప్రకటించిన ఈ రాయితీతోనైనా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో కదలికవస్తుందా అనేది సందేహమే.. గతంలో ఎదురైన చేదు అనుభవాల దృష్ట్యా దరఖాస్తుదారుల్లో పెద్దగా ఉత్సాహం కనిపించడం లేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా విచ్చలవిడిగా అక్రమ లే అవుట్లు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. తక్కువ ధరకు ప్లాట్లు వస్తున్నాయనే ఆశతో వేలాది మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. ఇలాంటి ప్లాట్లలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతివ్వకపోవడంతో ప్లాట్ల యజమానులు దయనీయస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ దుస్థితిని తొలగించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం 2015లో అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్ పథకాన్ని తెచ్చింది. లే అవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులను ఆహ్వానించింది. దీంతో రూ.10 వేల చొప్పున చెల్లించి ప్లాట్ల యజమానులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయంలో కొందరు కోర్టుకు వెళ్లడంతో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ నిలిచిపోయింది. ఎస్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్నవారికి భవన నిర్మాణ అనుమతుల్లో కొంత వెసులుబాటు కల్పించినా ఆశించిన మేరకు క్రమబద్ధీకరణ జరగలేదు. ఆ తరువాత 2020 ఆగస్టులో ప్రభుత్వం మరో జీవో తీసుకొచ్చింది. ఇందులో ప్లాట్లకు సంబంధించి రూ.వెయ్యి చొప్పున చెల్లించేందుకు అవకాశం కల్పించారు. క్రమబద్ధీకరణకు స్థలం విలువ లెక్కింపునకు ప్రభుత్వం శ్లాబులవారీగా కూడా ధరలు నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. ఎల్ఆర్ఎస్ చార్జీలు తగ్గిస్తూ 2020లో ఉత్తర్వులు జారీ అయ్యాయి. చదరపు గజం ధర ఆధారంగా క్రమబద్ధీకరణ కోసం చార్జీల స్లాబుల సంఖ్యను పెంచింది. నిర్దేశించిన ఖాళీ స్థలాలు వదలని చోట్ల చెల్లించాల్సిన రుసుము రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్ నిర్ణయించే ధరను ప్రాతిపదికగా చేసింది. ప్రత్యేకంగా నాలా చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రకటించింది. ఈ క్రమబద్ధీకరణ పథకం జీవో 131 ప్రకారం స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ అప్పట్లోనే ప్రారంభమైంది. ఈ మేరకు అనుమతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ఖమ్మం కార్పొరేషన్‌లో 9,942 దరఖాస్తులు రాగా.. 3,735 అనుమతి పొందాయి. వీటిలో 939 దరఖాస్తులకు ఫీజు చెల్లించారు. మధిర మున్సిపాలిటీలో 4,276 దరఖాస్తులు రాగా.. 1,488 అనుమతి పొందగా 97 దరఖాస్తులకు ఫీజు చెల్లించారు. సత్తుపల్లి మున్సిపాలిటీలో 3,688 దరఖాస్తులు రాగా.. 2,391 అనుమతి పొందాయి.. వీటిలో 62 దరఖాస్తులకు ఫీజు చెల్లించారు. వైరా మున్సిపాలిటీలో 3,516 దరఖాస్తులు రాగా.. 1,237 అనుమతి పొందగా వీటిలో 48 దరఖాస్తులకు ఫీజు చెల్లించారు. సుడా పరిధిలో 34,391 దరఖాస్తులు రాగా.. 7 మాత్రమే అనుమతి పొందగా వీటిలో 4 దరఖాస్తులకు ఫీజు చెల్లించారు.

### ఉచిత హామీని నిలబెట్టుకోవాలి



అధికారంలోకి వస్తే లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్)ను రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు మాట మార్చింది. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు కొనుగోలు చేసిన ఎల్ఆర్ఎస్ ప్లాట్లను ఉచితంగా క్రమబద్ధీకరిస్తాం అన్న హామీని కాంగ్రెస్ విస్మరించింది. కాంగ్రెస్ వస్తే నయా పైసా కట్టకుండా ప్లాట్లు, లే అవుట్లు క్రమబద్ధీకరించుకోవచ్చునని ఎదురుచూస్తున్న సామాన్య ప్రజలపై ప్రభుత్వం భారం మోపుతోంది. ఇది సరైనది కాదు. నాడు ఎల్ఆర్ఎస్ విషయంలో కేసీఆర్ సర్కార్‌పై విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఖజానా నింపుకునేందుకు పేదలపై గుదిబండ మోపుతున్నాడు.

– చిలుమూరు కోటి, 2వ డివిజన్, ఖమ్మం

### 50 శాతం రాయితీ ఇవ్వాలి..



ఎల్ఆర్ఎస్‌కు 25 శాతం రాయితీ ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ సర్కార్ సామాన్య ప్రజలను మోసగిస్తోంది. పేదలపై పడుతున్న భారాన్ని తగ్గించేందుకు 50 శాతం ఇవ్వాలి. ఐదేళ్లుగా ఎల్ఆర్ఎస్ కోసం ఎదురుచూస్తున్న ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకొని డబ్బులు వసూలు చేసేందుకు సిద్ధమైంది. అధికారంలోకి రాకముందు ఓట్లు కొల్లగొట్టేందుకు సాధ్యంకాని హామీలను ఇచ్చింది. ఎల్ఆర్ఎస్ విషయంలో మాట మార్చడం కాంగ్రెస్ మోసపూరిత విధానాలకు నిదర్శనం.

– హెచ్చు ప్రసాద్, 4వ డివిజన్, ఖమ్మం

# కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి

- ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీల ఊసెత్తని సర్కారు
- తెలంగాణ బిడ్డల కోసం పోరాడే పార్టీ బీఆర్ఎస్ మాత్రమే.
- బీఆర్ఎస్‌ను ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్న ప్రజలు
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 22 : హామీలు, గ్యారెంటీలు అంటూ గారడీ మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, ఓట్లేసి గెలిపించిన ప్రజలను నట్టేట ముంచారని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ధ్వజమెత్తారు. మణుగూరులోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ పాలనను ఎండగట్టారు. కేసీఆర్‌తో పోటీ పడలేక నోటికి ఏదొస్తే దానిని ప్రజలకు హామీగా ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీల ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. అవగాహన లేని నాయకులు పదవులు దక్కించుకుంటే వారికి పాలన గురించి ఏం తెలుస్తుందని, ఇచ్చిన హామీలు అమలు చేయలేక తప్పించుకునేందుకు రోజుకో డ్రామా ఆడుతున్నారన్నారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటిపై ఈడీ దాడులు చేసినా.. ఆ వివరాలు ఎందుకు వెల్లడించడం లేదని ఆయన ప్రశ్నించారు. దొరికిన డబ్బులు బీజేపీ, కాంగ్రెసోళ్లు పంచుకున్నారా.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఇటీవల కేటీఆర్‌పై పెట్టిన ఏసీబీ కేసు ఇక్కడ ఎఫ్ఐఆర్ చేయగానే ఆన్‌లైన్‌లో దాన్ని చూసి వెంటనే ఈడీ కేసు పెట్టిందని, ప్రజాస్వామ్యంలో బెదిరింపు, నిరంకుశ రాజకీయాలు, నియంతృత్వ పోకడలతో ఏమైనా ఒరుగుతుందా అనే దానిపై ఆలోచించాలన్నారు. ఐఏఎస్ అధికారులు కూడా నా మాట వినట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైల్వే లైన్ నిర్మాణం వల్ల భూములు కోల్పోయిన నిర్వాసితుల పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పిన మంత్రి సీతక్క ఆ మాటను విస్మరించిందని, మీకు రామానుజవరం పిల్లలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గొత్తికోయలను ఎస్టీలుగా చేస్తామని చెప్పిన మీరు ఇప్పుడు మంత్రిగా ఉన్నారు కదా.. వారికి ఎస్టీ సర్టిఫికెట్ ఎందుకు ఇప్పించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డల కోసం, వారి హక్కులు కాపాడడంలో వెనుకడుగు వేయకుండా పోరాడే పార్టీ, నిరంతరం పాటుపడే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. 350 మందికి పర్మినెంట్ ఉద్యోగాలు ఇప్పించానని, జెన్‌కో చరిత్రలో ఒకేసారి ఇంత మొత్తంలో ఉద్యోగాలు ఇప్పించింది తన హయాంలోనేనని గుర్తు చేశారు. పాయం లాంటి వారు ఇంకో పదిసార్లు గెలిచినా ఈ ప్రాంతానికి ఉపయోగం ఏమీ ఉండదని, అబద్ధాలు ఆడే వారిని, మాయమాటలు చెప్పే వారిని నమ్మొద్దన్నారు. ఇకనుంచి జరగబోయే ప్రతీ ఎన్నికలోనూ విజయం బీఆర్ఎస్‌దేనని, ప్రజలు కూడా బీఆర్ఎస్‌ను ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పోసం నరసింహారావు, కుర్రి నాగేశ్వరరావు, ముత్యం బాబు, అడపా అప్పారావు, కుంట లక్ష్మణ్, ముద్దంగుల కృష్ణ, యాదగిరి గౌడ్, వట్టం రాంబాబు, నూకారపు రమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# వారబందీ లేకుండా నీళ్లివ్వండి..

- గింజ దశలో నీరందకపోవడంతో దిగుబడి తగ్గే అవకాశం
- మధిర డివిజన్‌లో ఎండుతున్న పంటలను పరిశీలించిన ఏడీఏ



మధిర : మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు

మధిర, ఫిబ్రవరి 22 : వారబందీ లేకుండా సాగర్ కాల్వలకు నీటిని విడుదల చేయాలని మధిర డివిజన్ వ్యవసాయ ఉప సంచాలకులు స్వర్ణ విజయచంద్రను ఆయకట్టు రైతులు వేడుకున్నారు. చింతకాని మండలం తూటికుంట్ల మేజర్ కాల్వ పరిధిలో నీటి ఎద్దడికి గురైన మొక్కజొన్న పైర్లను వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు గడ్డం శ్రీనివాసరావు మాట్లాడుతూ తూటికుంట్ల మేజర్ కాల్వ పరిధిలో 1,400 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారని, గింజ దశలో ఉన్న పంటకు సాగునీరు అందకపోవడంతో దిగుబడి వచ్చే పరిస్థితి లేదని అధికారులకు వివరించారు. కాల్వ పక్కనే ఉన్న రైతులకు నీటిని బంద్ చేసి.. కింది రైతుల కోసం తరలించడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు స్పందించి పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఏడీఏ విజయచంద్ర మాట్లాడుతూ సాగునీటి అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారబందీలో భాగంగా మరో రెండు రోజుల్లో తూటికుంట్ల మేజర్ కాల్వకు ఇరిగేషన్ అధికారులు నీటి విడుదల చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏవో మానస, ఏఈ సంపత్‌కుమార్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

### మరో నాలుగు రోజులు పొడిగించాలి

బోనకల్లు, ఫిబ్రవరి 22 : సాగర్ ఆయకట్టు పరిధిలోని సాగు భూములకు వారబందీ ప్రకారం మరో నాలుగు రోజులు నీటి సరఫరాను పొడిగించాలని ఆయకట్టు రైతులు అధికారులను వేడుకున్నారు. మండలంలోని ఆళ్లపాడు గ్రామ రెవెన్యూ పరిధిలోని మొక్కజొన్న నీటి ఎద్దడిని క్షేత్రస్థాయిలో ఆత్మ కమిటీ మధిర నియోజకవర్గ డైరెక్టర్ కందుల పాపారావు, ఏఈవో బంధం రజిత శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ శుక్రవారం రాత్రి నుంచి సాగర్ నీళ్లు ఆళ్లపాడు రెవెన్యూ పరిధిలోని పైర్లకు అందుతుండగా.. మరో రెండు రోజులు మాత్రమే వారబందీ ప్రకారం నీళ్లు వస్తాయని అధికారులు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరో రెండు, మూడు రోజులు నీటి సరఫరాను పొడిగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే ఎన్నెస్పీ అధికారులతో మాట్లాడి నీళ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

# కేసుల విచారణలో జాప్యం చేయొద్దు..

- ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అవసరం
- ఠాణాల పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు





మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు, సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 22 : కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని, పోలీస్ అధికారులంతా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. నెలవారీ నేర సమీక్షా సమావేశంలో భాగంగా హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో గల కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పోలీస్ అధికారులతో ఎస్పీ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది నిత్యం రోడ్లపై తిరుగుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా హాట్ స్పాట్స్‌ను గుర్తించి గంజాయి రవాణా చేసే వ్యక్తులతోపాటు సేవించే వారిపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ.. అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. జిల్లావ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి, బాధితుల ఫిర్యాదుకు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలన్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడకుండా.. సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీలు షేక్ అబ్దుల్ రెహమాన్, ఆర్.సతీష్‌కుమార్, చంద్రభాను, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, అన్ని సబ్ డివిజన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

# విధులు పకడ్బందీగా నిర్వహించాలి

### ఎమ్మెల్సీ ఎన్నికల శిక్షణా తరగతుల్లో కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్సీ ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. ఈ నెల 27న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పీవో, ఏపీవోలకు రెండో విడత శిక్షణా తరగతులు ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బందికి పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. సిబ్బంది ముందు రోజే పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటర్ల జాబితా, బ్యాలెట్ పేపర్లు, బాక్సులు, ఎన్నికల సామగ్రిని పరిశీలించుకోవాలన్నారు. ఈ నెల 26న కొత్తగూడెంలోని రామచంద్ర డిగ్రీ కాలేజీలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఉంటుందని, ఆరోజు విధిగా సమయపాలన పాటించి పోలింగ్ సామగ్రిని తీసుకొని తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని ఆదేశించారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, తర్వాత బాక్సులకు సీల్ వేసి నేరుగా నల్లగొండ కలెక్టరేట్‌కు తరలించాలని సూచించారు. పోలింగ్ అధికారులు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, రంగాప్రసాద్, జిల్లా ఎన్నికల మాస్టర్ ట్రైనీలు పూసపాటి సాయికృష్ణ, కిరణ్ కుమార్, అశోక్, నవీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

# పట్టుదలతో ఆడితే విజయం మీ సొంతం

- టెన్నిస్ ఆటతో ఫిజికల్ ఫిట్‌నెస్, మెంటల్ స్టెబిలిటీ
- ఆలిండియా ఓపెన్ టెన్నిస్ టోర్నీ ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 22 : పట్టు వదలకుండా టెన్నిస్ ఆట ఆడితే విజయం మీ సొంతమవుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా టెన్నిస్ అసోసియేషన్(కేటీడీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలిండియా ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, డీవైఎస్‌వో తుంబూరు సునీల్‌రెడ్డితో ట్రయల్ మ్యాచ్ ఆడి క్రీడల పట్ల తనకున్న మక్కువను చాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్‌కు ఖమ్మం వేదిక కావడం మంచి పరిణామమన్నారు. టెన్నిస్ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఆటతో మంచి ఫిజికల్ ఫిట్‌నెస్, మెంటల్ స్టెబిలిటీ లభిస్తాయన్నారు. భారతదేశం నుంచి మరో లియాండర్ పేస్, సానియా మీర్జా లాంటి టెన్నిస్ క్రీడాకారులు తయారు కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం స్టేడియంలోని పరిసరాలు, ఇతర క్రీడా విభాగాలను స్వయంగా పరిశీలించారు. టేబుల్ టెన్నిస్ స్టాండ్స్ వద్దకు వెళ్లి డీవైఎస్‌వోతో కలిసి కొద్దిసేపు ఆడారు. కార్యక్రమంలో ఏసీపీ కుమారస్వామి, ట్రాఫిక్ సీఐ సాంబశివరావు, టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చల్లపల్లి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్ కాసినేని, ట్రెజరర్ కాంపాటి సత్యనారాయణ, చీఫ్ రిఫరీ ప్రవీణ్‌నాయక్, కాళ్ల పాపారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమేశ్, కాళ్ల సూర్య తదితరులు పాల్గొన్నారు. కాగా.. మొదటి రోజు ఆరు మ్యాచ్‌లు జరిగాయి.

# పాఠశాలల్లో రీడింగ్ రూమ్‌లు

### గ్రంథాలయ సంస్థ కార్యకలాపాలపై అదనపు కలెక్టర్ శ్రీజ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం, ఫిబ్రవరి 22 : ప్రతి మండలంలోని రెండు పాఠశాలల్లో రీడింగ్ రూమ్‌లు ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో శనివారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తక పఠనంపై విద్యార్థులకు ఆసక్తి కలిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్ వసూళ్లు, మరమ్మతులు, అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలన్నారు. నిధుల లేమితో నిలిచిపోయిన పనులను అందుబాటులో ఉన్న నిధులతో పూర్తి చేయాలని ఆదేశించారు. గత ఏడాది నిధుల కేటాయింపు, ఖర్చులు, రాబోయే సంవత్సరం నిధులపై ప్రతిపాదనలు రూపొందించాలని, సంస్థ సభ్యుల సమావేశం వచ్చే వారంలో ఏర్పాటు చేసి తీర్మానం తర్వాత ఆమోదానికి పంపించాలన్నారు. సమావేశంలో డీఈవో సోమశేఖర శర్మ, డీపీవో ఆశాలత, జిల్లా గ్రంథాలయ సంస్థ ఇంచార్జి కార్యదర్శి అర్జున్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.